క్లుప్తంగా

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బేతంచెర్ల: మండలంలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన పొలాలకు వెళ్లే రైతులకు, ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా రైల్వేట్రాక్‌పై అండర్ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం గ్రామంలోని సచివాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. లెవల్ క్రాసింగ్ గేట్ నంబర్ 162 దగ్గర ఉన్న గేట్లను మూసివేసి వాటి స్థానంలో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులకు అనుగుణంగా 6 మీటర్లు వెడల్పు, 5 మీటర్ల ఎత్తులో అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతామన్నారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ జ్యోస్న, సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ, రైతులు పాల్గొన్నారు.

అమ్మవారికి సమర్పించిన బియ్యం వేలం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో భక్తులు విరాళంగా సమర్పించిన బియ్యానికి గురువారం వేలంపాట నిర్వహించారు. లావు బియ్యం కిలో రూ.26.50, పులగం బియ్యం కిలో రూ.30.50 ప్రకారం అహోబిలం గ్రామానికి చెందిన నాగశేషుడు పాటపడి దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ రామానుజన్ తెలిపారు. లావు బియ్యం సుమారు ఏడువేల టన్నులు, పులగం బియ్యం 900 కేజీలు ఉంటాయని ఈఓ తెలిపారు.

మహేశ్వరిని గెలిపించండి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామ పంచాయితీలోని నాల్గవ వార్డులో జరిగే ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిగా బరిలో ఉన్న కొండా మహేశ్వరిని గెలిపించాలని ఉప సర్పంచ్ మహేశ్వరరెడ్డి, నాయకులు దస్తగిరి,మొలక హుశేని తదితర నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వార్డులోని ఇంటింటికి వెళ్లి గౌను గుర్తుకు ఓటు వేసి మహేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

విగ్రహాన్ని జరిపేందుకు సహకరించాలి

బేతంచెర్ల: పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డులో ఉన్న డాక్టర్ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని వెనకాలకు మార్చడానికి కుల సంఘాల నాయకులు సహకరించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులు రాజయ్య, రామసుబ్బయ్య, నడ్డి శ్రీను, బొల్లి మద్దిలేటిలతో కలిసి చైర్మన్ ఆ స్థలాన్ని పరిశీలించారు. జగ్జీవన్ రామ్ విగ్రహం రహదారి ఎదుట ఉన్నందున వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, దీంతో ప్రజల సౌకర్యార్థం కొద్దిగ వెనకాలకు మార్చడానికి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీతారామాపురం సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ అబ్దుల్ హక్

అవుకు: అవుకులోని సాయికిరణ్ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, మద్దిలేటి స్వామి పెస్టిసైడ్స్ దుకాణాలను గురువారం ఏఓ అబ్దుల్ హక్ తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులతో పాటు గోడౌన్‌లలో స్టాక్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి దుకా ణంలోనూ రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లులను తప్పకుండా ఇవ్వాలని సూచించా రు. అలాగే ఎరువుల దుకాణాల డీలర్లు ప్రభుత్వంచే అనుమతి పొందిన ఎరువు లు,పురుగుల మందులను మాత్రమే విక్రయించాలని లేదంటే, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి పనులపై సమావేశాలు నిర్వహించుకోవాలి

బేతంచెర్ల: ఉపాధి హామీ పనులపై ప్రతి నెల శుక్రవారం సమావేశం నిర్వహించుకోవాలని సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ నీలకంఠం ఉపాధి కూలీలకు సూచించారు. గురువారం మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె, ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామంలో 17వ విడత సామాజిక తనిఖీ గ్రామ సభలు డీఆర్‌పీల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబాపురం గ్రామంలో 48 పనులకు రూ. 40.15 లక్షలు, ఆర్ఎస్ రంగాపురంలో 64 పనులకు రూ.86.11 లక్షలు, ఆర్ కొత్తపల్లెలో 24 పనులకు రూ.22.74 లక్షల వెచ్చించినట్లు గ్రామ సభలలో నివేదికలు వినిపించారు. కార్యక్రమంలో వ్యక్తిగత పరిశీలకులు దస్తగిరి బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గుమ్మగాల్ల రాజు, శ్రీనివాసులు, ఎంపీటీసీలు మునేశ్వర్‌రెడ్డి, ఏపీఓ శేషన్న పాల్గొన్నారు.

సులువైన 'సాగు'

- యంత్రాల సేద్యంపై ఆసక్తి చూపుతున్న రైతన్నలు



ట్రాక్టర్ సహాయంతో బేతంచెర్లలో విత్తనాలు వేస్తున్న రైతన్నలు

బేతంచెర్ల : వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతులు సైతం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. శాస్త్ర వేత్తల కృషితో మేలు రకం వంగడాలతో రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారు. కాలానుగుణంగా రైతులు సాగులో నూతన పద్ధతులు పాటిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తూ రైతులను ప్రోత్సహిస్తుంది. అదేవిధంగా చిన్న పాటి ట్రాక్టర్లకు రాయితీ ఇస్తుండటంతో అన్నదాత యంత్రాల సాయంతో చేసే వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు. కాడిఎడ్లతో ఉదయం నుంచి సాయంత్రం వరకు విత్తనం చేపడితే 6 ఎకరాలకు మించదు. అయితే యంత్రాలతో రోజుకు 15 ఎకరాల వరకు విత్తనం వేయవచ్చు అని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే గ్రామాల్లో యంత్రాల సహాయంతో పంటల పొలాలులో దుక్కులు దున్నడం, వరి మడులు ఏర్పాటు తదితర పనులు చేపడుతున్నారు. యంత్ర పరికరాల సహాయంతో ఎక్కువ వీస్తీర్ణంలో పంటల సాగుతో పాటు సమయం కలిసి వస్తుండటంతో కాడి ఎద్దులకు బదులుగా ట్రాక్టర్ల సహాయంతో విత్తనాలు వేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు రైతు గ్రూపులకు ట్రాక్టర్లను ప్రభుత్వం రాయితీపై ఇస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాల్లో 33 ట్రాక్టర్లను రైతు గ్రూపులకు అందజేశారు. డోన్ నియోజవర్గ వ్యాప్తంగా 300 నుంచి 400 ట్రాక్టర్ల వరకు వ్యవసాయానికి వినియోగిస్తున్నట్లు సమాచారం.

సమయం ఆదా అవుతుంది



కాలం మార్పులకు అనుగుణంగా ఎడ్లతో వ్యవసాయం కంటే ట్రాక్టర్‌తో చేయడం వలన సమయం ఆదా అవుతుంది. ఎక్కువ విస్తీర్ణంలో తొందరగా పంటలు సాగు చేయడానికి అవకాశం ఉంది. పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. వ్యవసాయం పనులు అందరూ కలిసి పాల్గొనడమే కాకుండా పశుపోషణ చూసుకోవడానికి అవకాశం ఉండేది. నేడు ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయాయి.

– యాదగిరి వెంకటేశ్వర్లు, అంబాపురం గ్రామం

భారంగా మారిన పశుపోషణ



సకాలంలో వర్షాలు పడకపోవడంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. దీంతో పశు పోషణ కూడా భారంగా మారింది. ఎడ్ల వ్యవసాయం ఇబ్బందిగా మారడంతో యంత్రవ్యవసాయం వైపు మక్కువ చూపుతున్నారు. నాడు కుటుంబ సభ్యులందరూ పొలం పనుల్లో పాల్గొనే పరిస్థితి. నేడా పరిస్థితులు లేవు. కాలానికి అనుగుణంగా మారాల్సిందే.

–సంధానీబాషా, బేతంచెర్ల గ్రామం

దత్తాత్రేయస్వామికి పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ లవన్న, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

శ్రీశైలంలో శివచతుస్సప్తాహ భజనలు

పవిత్రశ్రావణమాసంలో శివనామస్మరణ అత్యంత శ్రేష్ఠమైనది. లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం శ్రావణమాసం శ్రీశైలదేవస్థానం శివచతుస్సప్తాహ భజనలు నిర్వహిస్తోంది. గురువారం ఈ భజనలను అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ, స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా విశేషపూజలు జరిపించారు. అనంతరం పంచాక్షరీ నామ భజన ప్రారంభించారు. వీరశిరోమండపంలో సెప్టెంబర్ 15వ తేదీ వరకు రేయింబవళ్లు ఈ భజనలు కొనసాగుతాయి. కర్నూలుకు నగరానికి చెందిన 5, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలకు శ్రావణమాసంలో శివభజనలు చేయడానికి దేవస్థానం అవకావం కల్పించింది.

ముగిసిన వార్డు సభ్యుల ఎన్నికల ప్రచారం



ఎం.పేండేకల్లులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: మండలంలోని ఎం,పేండేకల్లు, రహిమానుపురంలో ఈనెల 19వ తేదీన జరిగే వార్డు ఎన్నికలకు సంబంధించి ప్రచారం గురువారం ముగిసింది. వైఎస్సార్‌సీపీ మద్దతు దారులుగా బరిలో నిలిచిన ఎం. పేండేకల్లులో మిట్ట వేణుగోపాలు రెడ్డి, రహిమానుపురంలో బారికోల్ల ప్రసాద్‌ను గెలిపించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ప్రచారం చేశారు.

ఆకుమల్లలో ఎన్నికల ప్రచారం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామం పదవ వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతురాలిగా పోటీ చేస్తున్న మాలె స్వరూపను గెలిపించాలని కోరుతూ గురువారం ఆకుమల్ల సొసైటీ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పదవ వార్డు మెంబర్‌గా మాలె స్వరూప గుర్తు ప్రెషర్ కుక్కర్‌పై ఓటు వేసి గేలపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మెహన్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, వెంకటరామిరెడ్డి, కాశింబాషా, రమేష్ రెడ్డి, ఉస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వార్డు సభ్యుల ఉప ఎన్నిక ప్రచారం

ప్యాపిలి: పట్టణంలోని రెండో వార్డు, అలేబాదుతండాలోని ఐదో వార్డుకు సంబంధించి ఉప ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసింది. రెండో వార్డుకు వైఎస్సార్ సీపీ మద్దతుదారులుగా జక్కు వెంకటలక్ష్మి, అలేబాదుతండాలో రమావత్ లక్ష్మిబాయి పోటీ చేస్తున్నారు. 19వ తేదీ ఉప ఎన్నిక జరుగనుంది. వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తున్న అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ఓటర్లు పరిగణలోకి తీసుకోవాలని అభ్యర్థులు ఓటర్లను కోరుతున్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడు, మంగంపేటలో పాఠశాలలోని విద్యార్థులు, అంగన్‌వాడీ సెంటర్లలోని చిన్నారులు, బయట తిరిగే పిల్లలకు మాప్ అప్‌డే వార్మింగ్ డేలో భాగంగా గురువారం అల్బెండజోల్ మాత్రలను ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్లు వినోద్‌కుమార్, నవీన్ మాట్లాడుతూ 1నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు పిల్లల ఆరోగ్యం కోసమే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్ సాహెబ్,మల్లీశ్వరి,వేణుగోపాలరాజు, దానమ్మ, తెరిసమ్మ, సీహెచ్‌ఓలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న బాలల పరిరక్షణ అధికారిణి శారద

బేతంచెర్ల: బాల్య వివాహాలు చట్టా రీత్యా నేరం అని నంద్యాల జిల్లా బాలల పరిరక్షణ అధికారిణి శారద హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కొత్తపేట విధిలో పూసల కులాల కుటుంబాలలో ఆరుగురికి బాల్య వివాహాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం ఆమె విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా కుల పెద్దల కుటుంబాల దగ్గరకు వెళ్లి చిన్న వయసులో పెళ్లిల్లు చేస్తే కలిగే నష్టాలను ఆమె వివరించారు. చట్టం ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు పూర్తయ్యాకే వివాహం చేయాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆమె హెచ్చరించారు. స్పందించిన పెద్దలు నిబంధనల మేరకు వయసు వచ్చిన తర్వాతే వివాహం చేస్తామని రాతపూర్వకంగా అంగీకరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే చైల్డ్ హెల్ప్ లైన్ –1098 సమాచారం ఇవ్వాని సూచించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ సోషల్ వర్కర్ నరసింహులు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సుంకన్న, బీబీఏ కోఆర్డినేటర్ తిమ్మారెడ్డి, లైఫ్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను తరిమేద్దాం



ఆశావర్కర్లకు సూచనలు చేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల: 19 సంవత్సరాల్లోపు పిల్లలకు నులిపురుగుల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తున్నట్లు ఇమ్యూనైజేషన్ జిల్లా అధికారి మల్లికార్జునరెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోవెలకుంట్ల సీహెచ్‌సీ పరిధిలోని అల్లూరు, నొస్సం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టిలో ఉండే నులిపురుగుల గుడ్లు అపరిశుభ్రమైన చేతుల ద్వారా జీర్ణవ్యవస్థలోకి చేరి జీర్ణకోశ, ఆంత్ర వ్యాధులు కలుగజేస్తాయన్నారు. వీటి నివారణకు ఆరు నెలలకొకసారి ఆల్‌బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెనడి, హెల్త్‌సూపర్‌వైజర్ మునిస్వామి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్ : మున్సిపల్ మెప్మా విభాగంలోని ఆర్పీ కళ్యాణిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రామాంజనేయులు, శివరాంలు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్రామిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. కళ్యాణిపై దాడి జరిగి వారం అయినా ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా విచారణ చేసి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని మిగిలిన వారికి రక్షణ భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీలు ఈరమ్మ, నూర్జహాన్, సరస్వతి, సుగుణమ్మ, శశికళ, మంగమ్మ, రత్నా భాయి, మహబూబి, అరుణ, రాగసుధ, జరినాభీ, కుమారి, చాంద్‌బీ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో నిందితుడికి రిమాండ్

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామానికి చెందిన రెక్కల కంబగిరి స్వామిని నాటుసారా కేసులో గురువారం రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గ్రామంలో నాటుసారా అమ్ముతుండగా అతడిని అదుపులోకి తీసుకొని, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఓపెన్ విద్యకు అడ్మిషన్లు

కోవెలకుంట్ల: ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు ఎంఈఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. 14 సంవత్సరాలు పైబడిన పిల్లలు ఓపెన్ టెన్త్‌లో చేరేందుకు ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్‌లో చేరే విద్యార్థులు పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాజరై అడ్మిషన్లు పొందాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో నాగప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన నాగులకట్ట వద్ద గురువారం నాగ ప్రతిష్ఠ మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గోపూజ, గణపతి పూజ, మాతృకాపూజ, పంచగవ్యప్రాశన, ప్రాత:కాల పూజ, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు కొనసాగాయి. పట్టణంలోని ఆయా కాలనీలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

లాడ్జిపై పోలీసుల దాడి

డోన్ టౌన్ : స్థానిక కొత్తబస్టాండ్ ఎదురుగా ఉన్న చందమామ లాడ్జిపై పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసులు దాడి చేసి ఇద్దరు విటులు, ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ దాడులు జరిపినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతానికి ఇద్దరు వ్యక్తులతో పాటు వేరే ప్రాంతానికి చెందిన ఓ మహిళను అదుపులోకి తీసుకున్నామన్నారు. పూర్తి సమాచారం కోసం వీరిని విచారిస్తున్నామని చెప్పారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, నాయకుల సమావేశం

డోన్ టౌన్ : పట్టణంలోని షాధిఖానాలో శుక్రవారం సచివాలయ కన్వీనర్లకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఐ–ప్యాక్ టీమ్, మండల స్థాయి నాయకులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయం గురువారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి హాజరుకావాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు ఆధార్ కార్డు, ఒక పాస్ ఫొటోతో రావాలని సూచించారు.

డిప్యూటీ డీఈఓ కార్యాలయాన్ని సందర్శించిన డీఈఓ

డోన్ టౌన్ : స్థానిక డిప్యూటీ డీఈఓ కార్యాలయాన్ని గురువారం జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి సందర్శించారు. మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సర్వీసు రికార్డులను తనిఖీ చేశారు. ఈయన వెంట మండల విద్యాధికారి ప్రభాకర్ ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

డోన్ టౌన్ : పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డికి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్,జిల్లా ఉపాధ్యక్షుడు రంగరత్నం వినతి పత్రం అందజేశారు. డోన్ పర్యటనకు వచ్చిన డీఈఓను కలిసిన నాయకులు ఆ పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రామ్మోహన్, సిద్ధూ, రవి, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ తప్పనిసరి

సంజామల: సాగుచేసిన ప్రతి పంటను రైతు ఈ క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ సుధాకర్ రెడ్డి సూచించారు. ఈ క్రాప్‌తో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని, పంట నష్ట పరిహారం, బీమా తదితర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు రైతులకు వర్తిస్తుందన్నారు. సెప్టెంబర్ 15వ తేదిలోపు పంట నమోదు చేయించుకోవాలని ఏఓ రైతులకు సూచించారు.

చెన్నై వరకు ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగించండి

బొమ్మలసత్రం: ప్రయాణికుల సౌకర్యార్థం నంద్యాల నుంచి చెన్నై వరకూ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పొడిగించేందుకు చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి డీఆర్ఎం మనీష్ అగర్వాల్‌ను కోరారు. గురువారం డీఆర్ఎం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా నంద్యాలలో ఎంపీ పోచాను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ జిల్లా ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్ల పొడిగింపుపై డీఆర్ఎంకు వినతి పత్రం అందజేశారు. కౌలూరు గ్రామం వద్ద ఉన్న రైల్వే గేటు వద్ద బ్రిడ్జీ ఏర్పాటు చేయాలని కోరారు. మైసూర్ నుంచి రేణిగుంట వరకు ప్రయాణిస్తున్న వారంతపు ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాల వరకు పొడిగించాలని కోరారు. అలాగే విశాఖపట్నం నుంచి కడప వరకు నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును నంద్యాల వరకు పొడిగించాలని విన్నవించారు. బనగానపల్లె, కోవెలకుంట్ల రైల్వే స్టేషన్లలో రిజర్వేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుంతకల్లు – డోన్ ఎక్స్‌ప్రెస్ రైలును ధర్మవరం వయా నర్సాపురం వరకు పొడిగించాలని విన్నవించారు.

ఆశా కార్యకర్తలకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాలటౌన్: ఆశా కార్యకర్తలు నిబద్ధతతో పని చేస్తూ ప్రజారోగ్యాన్ని రక్షించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. గురువారం నూతనంగా నియమితులైన ఆశా కార్యకర్తలకు స్థానిక కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సేవలో ఆశా కార్యకర్తల పాత్ర ముఖ్యమైనదని క్షేత్రస్థాయిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించటం, బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వారికి వైద్య సేవలు అందించడంలో ప్రధాన పాత్ర వహిస్తారన్నారు. శిక్షకులు ప్రతిభ, స్వర్ణ గౌరీ, సరళ గంగ, డీసీఎం వీరన్న పాల్గొన్నారు.